# మగతనం

వింధ్యవాసిని




**అప్పుడే** మెలకువ వచ్చిన లలిత పక్కలో ముడుచుకుని ఉన్న పసిబిడ్డని చూసుకుంది. ఆత్రతగా చుట్టూ పరికించి చూసింది, తనవాళ్ళెవరయినా తనకోసం వచ్చేరేమోనని.

లలితకి నిరాశే ఎదురయింది. మునుపటి రోజు సాయంత్రం భర్త తనని ఈ నర్సింగ్‌హోమ్‌కి తీసుకొచ్చి వదలటం, తరవాత రెండు గంటలసేపు నొప్పులతో తను నరకయాతన అనుభవించటం, గాఢ సుషుప్తిలోకి జారిపోవటం—ఇంతవరకే గుర్తున్నాయి ఆమెకు.

మొదటి కానుపు కావటం వల్లనేమో తను నిజంగా చాలా భయపడిపోయింది. కనీసం భర్త వెంట తోడుగా ఉంటే కాస్త ధైర్యంగా ఉండేదేమో! అతను మాత్రం ఆమెని నర్సింగ్ హోమ్‌లో చేర్చగానే బాధ్యత తీరిందన్నట్లు తన పని మీద తాను వెళ్ళిపోయాడు. భార్యకు ప్రసవం అయిందని చెప్పుకుని లీవు తీసుకోవటం అతగాడికి ఇష్టం లేదు.

అప్పుడే మందుల ట్రేతో అడుగు పెట్టింది నర్స్.

“సిస్టర్, మా వారు వచ్చి వెళ్ళారా?”

“ఊహుఁ—ఇంతదాకా మీకు స్పృహ లేదుగా. ఇప్పుడు లేచారని ఫోన్ చేస్తాను. వస్తారు లెండి.”

‘హుఁ! అయితే ఒక్కసారి కూడా ఇటువైపు ఇంతదాకా ఈయన రానేలేదన్న మాట. కనీసం తన బిడ్డని ఒకసారి చూడాలని అయినా అనిపించలేదు కాబోలు. ఛీ! ఏం మనిషి!’ అనుకుంది లలిత మనసులో.

“మొదటి చూలుకి పండంటి అబ్బాయిని కన్నారు. మరి మాకంతా ఏదయినా బహుమతి ఇప్పిస్తారా?” అంటున్న నర్స్ మాటలు లలిత చెవి కెక్కనే లేదు.

మళ్ళీ కళ్ళు మూసుకుని పడుకుంది.

సిస్టర్ వెళ్ళిపోయింది. ఎక్కడివో మాటలు వినిపిస్తున్నాయి లలితకి. చుట్టూ పరికించి చూసింది. పక్క గదికీ, తనున్న గదికీ మధ్యనున్న మూసిన తలుపులు కనిపించాయి.

“ఈ కొంచెం తిను, రాణీ, ప్లీజ్...”

“ఒద్దండీ—నోరంతా చేదుగా, కడుపులో వికారంగా ఉంది.”

“అలాగే ఉంటుంది మరి. అలాగని తినటం మానేస్తే ఈ నీరసం ఎలా తగ్గుతుంది?”

“అబ్బ, అయిపోయింది. కాఫీ ఇప్పుడే వద్దు—కాస్సేపాగి తాగుతాలెండి.”

“నీ ఇష్టం. ఎప్పుడు తాగాలనిపిస్తే అప్పుడే ఇస్తాను.”

“అదేమిటి, ఇవేళ కూడా ఆఫీసుకు వెళ్ళరా!”

“ఊహుఁ, నువ్వింటికొచ్చేదాకా నేను ఆఫీసుకు వెళ్ళను.”

“అయ్యో! మళ్ళీ మొదటికొచ్చారు గదా! నిన్న చెప్పిన పాఠాలన్నీ ఏమయాయి?”

“గాలిలో కలిసిపోయాయి గానీ, మన యువరాణిగారేమంటున్నారు? ఏదీ—ఇట్లా ఇవ్వు. ఏమిటే ఇవాళ నిశ్శబ్దంగా ఉందే... పైగా నవ్వులు కూడా

చిందిస్తోంది చూడు... ఓహో! ఇదా సంగతి... పాలు తాగటం నేర్చేసుకుందన్న మాట—పొట్ట నిండింది కాబోలు, సంతోషంగా ఉంది.''

"ఏమిటో మొదటి చూలు అబ్బాయి అయితే బావుండేది.''

"ఏం? అబ్బాయయితే నీ తల మీద కొక కిరీటం తెచ్చి పెడతాడనేనా? అమ్మాయి పుడితే ఏం నష్టం వచ్చింది? చదువుకున్న దానివి—నీక్కూడా ఈ పట్టింపు లేమిటో అర్థం కాదు నాకు.''

కళ్ళు మూసుకుని అవతలి గదిలోంచి వస్తున్న మాటల్ని లీలగా వింటున్న లలితకి తన భర్త మాటలు గుర్తొచ్చాయి.

"మా వంశంలో అంతా మొదటి సంతానం అబ్బాయిలే. అబ్బాయి అంటే వంశోద్ధారకుడనే వారు మా తాతయ్య. మనకూ అలాగే మగపిల్లవాడే పుట్టాలి'' అనేవాడు కాంతారావు, అదేదో లలిత చేతిలో పని అయినట్లు. అతని మూర్ఖత్వానికి నవ్వు వచ్చినా, కర్మకాలి ఆడ పిల్ల పుడితే ఏంచేస్తారో అని తలుచుకుని భయపడేది లలిత. భగవంతుడు చల్లగా చూడబట్టి మగ పిల్లవాణ్ణే కన్నది. అయినా కొడుకును కళ్ళతో చూసుకువెందుకయినా రావాలని అనిపించలేదు కాబోలు! ఏం మనిషి? హుఁ—తెలిసిందే గదా ఆయన తత్త్వం.' నీరసంగా అనుకుంది లలిత.

వరండాలో బూట్ల టకటక శబ్దం వినిపించింది. యూనిఫారమ్‌లోనే వచ్చాడు ఇన్‌స్పెక్టర్ కాంతారావు.

చూపులు ద్వారం వైపు మళ్ళించి చూస్తున్న లలితకి భర్త అక్కడే ఆగి ఎవరితోనో మాట్లాడటం వినిపించింది.

"హలో నువ్వట్రా రాజేశ్వర్రావ్. ఏమిటే ఏం చేస్తున్నావ్ ఇక్కడ?''

నేరస్థులతోనూ మామూలు మనుషుల తోనూ ఒకే రకంగా మాట్లాడతాడు కాంతారావు.

"అబ్బ! ఎన్నాళ్ళకుకలిశాం కదూ? నువ్వేమిటి—కొంపదీసి మీ మిసెస్ కూడా...''

"ఇదుగో ఈ గదే. మొదటి సంతానం. అబ్బాయి పుట్టాడు.'' గర్వంగా అంటున్నాడు కాంతారావు.

"వెరీ గుడ్, కంగ్రాచ్యులేషన్స్‌రా...మాకు పాప పుట్టింది. మొన్ననే అయింది ప్రసవం. ఒక్కసారిలా వచ్చి మా పాపని చూసి వెళ్ళు.''

"అబ్బే, ఇప్పుడు టైమ్ లేదు. అర్జెంటుగా వెళ్ళిపోవాలి.''

"పోన్లే. సరే పద, నేనయినా మీ వంశోద్ధార కుణ్ణి దర్శించుకుంటాను.'' ఇద్దరూ కలిసే లోపలి కొచ్చారు.

అతని స్వరాన్నిబట్టి ఇంత సేపు తను అవతలి గదిలోంచి విన్న మాటలు ఇతనివేనని గ్రహించుకుంది లలిత. 'ఎంత అదృష్టవంతురాలో ఆ ఇల్లాలు!' అనుకోకుండా ఉండలేకపోయింది.

వాళ్ళిద్దరి రాకను గమనించి, లేచి కూర్చో బోయింది లలిత. కానీ శక్తి చాలలేదు.

కొన్ని క్షణాలపాటు బాబుని పరిశీలించి చూసి, "ఎలాగుంది?'' అనడిగాడు భార్యని.

"ఫరవాలేదు, బావుంది.''

బాబు బుగ్గలు పుణికి, "మరి నే వెళ్ళొస్తా—పనుంది. పక్క గదేగా—డిస్‌చార్జి అయేదాకా కలుస్తూ ఉంటాంలే'' అని వెళ్ళిపోయాడు అతను.

అతన్ని చూస్తే పరిచయం ఉన్న ముఖంలా తోచసాగింది లలితకి. కానీ ఎక్కడ, ఎప్పుడు చూసి నదీ మాత్రం గుర్తుకు రావటం లేదు.

లలిత ముఖంలో ప్రశ్నార్థకాన్ని గమనించి, "వాడా రాజేశ్వర్రావని నా క్లాస్‌మేటులే. ఒట్టి అడంగి వెధవ. అప్పట్లో మేం వాణ్ణి బాగా ఏడి పించే వాళ్ళం. ఇక్కడేదో హోటల్లో అనుకుంటా ఉద్యోగం చేస్తున్నాడు. అమ్మాయి పుట్టిందని గొప్ప చెప్పుకుంటున్నాడు, సిగ్గులేకుండా. అన్నట్టు, వాడి భార్య ఉన్నది ఈ పక్క గదే అట.''

మాట మాటకీ ముద్దుగా పెంచుకున్న గుబురు మీసాలు సవరించుకోవటం అలవాటు కాంతారావుకి. రాజేశ్వర్రావుకి లాగా మీసాలు ఉంచుకోని వాళ్ళంతా ఆడారి వెధవలని అతగాడి అభిప్రాయం.

"ఏమండీ, మా అమ్మవాళ్ళకి టెలిగ్రామ్ ఇచ్చారా?''

"ఎందుకూ? ఓహో! చూడాలనుందా? ఇవాళ ఉత్తరం రాస్తాలే. ఎవరొచ్చి ఏం చేయాలి? నాకు ఇబ్బంది—వాళ్ళందరికీ మర్యాదలు చేయలేక. ఒకేసారి బారసాలకు రమ్మని రాద్దామనుకున్నాను. ఇక్కడ నీక్కావలసినవన్నీ నర్సింగ్ స్టాఫ్ చూసుకుంటారు. ఎందుకు చూసుకోరూ? మన దగ్గర డబ్బు గుంజటం లేదూ? ఊ మరి నే వెళ్ళొస్తా. వీలయితే రేపొస్తాలే. డాక్టర్ వచ్చినప్పుడు అడుగు ఎప్పుడు డిస్‌చార్జ్ చేస్తారో?''

"ఏమండీ...బాబు...''

"ఆఁ. చూశాను. ఏమిటో అంత చిన్నగా పిండి ముద్దలా ఉంటే తాకాలంటే అదోలా గుంది.''

బూట్లు టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు కాంతారావు. వరండాలో ఎవరో స్టాఫ్ కనిపించినట్లున్నారు, డిస్‌చార్జ్ అయేటప్పుడు అందరికీ బహుమతులిస్తానని భర్త అనటం వినిపించింది లలితకి.

కాంతారావు, అతని ప్రవర్తన మూడేళ్ళుగా చిరపరిచితమే అయినా, ఇవాళెందుకో మరీ బాధగా ఉంది లలితకి. తమ ప్రేమ ఫలం, తమ మొదటి సంతానం అయిన బాబును కళ్ళారా చూసుకుని ఒక్కసారయినా తాకాలనీ, ముద్దు పెట్టుకోవాలనీ అనిపించలేదేమో ఆయనకి. ఆయన హృదయానికీ, పాషాణానికీ తేడా ఏమీ లేదని అనుకుంది లలిత.

'హుఁ—అసలు ప్రేమ అంటే ఏమిటో అర్థం తెలుసా ఆయనకు? తెలిసే ఉంటుందిలే. కానీ తన్ను తాను ప్రేమించుకోవటం తప్ప, ఇతరులని—భార్య అయితేనేం, కొడుకయితేనేం — అభిమానించటం ఆయన చేయడు. అందరు మగవాళ్ళు ఇలాగే ఉంటారా నా కర్మగాని' అనుకుంది లలిత.

భార్యని ప్రేమించి, గౌరవించేవాడిని, పెళ్ళాం కొంగు పట్టుకొని తిరిగేవాడని ఎగతాళి చేయటం అలవాటు కాంతారావుకి.

● ● ● ●

## ముట్నూరివారి ప్రత్యేకత

'కృష్ణాపత్రిక' సంపాదకులు, ప్రముఖ స్వాతంత్ర్య యోధులు అయిన ముట్నూరి కృష్ణారావు గారి దగ్గరకు కొందరు వచ్చి ఆయనను పొగడటం మొదలు పెట్టారు. ఆయనకు పొగడ్తలంటే చెడ్డ చిరాకు.

"మీ కలం కత్తి లాంటిది. మీ సంపాదకీయాలు దుందుభులు. ఎంత పాండిత్యం! ఎంత వేదాంతం! ఎంత ప్రతిభ! ఎంత దేశభక్తి!'' ఇలా ప్రవాహంలా సాగుతున్న ప్రశంసలకు హఠాత్తుగా అడ్డుకట్ట వేస్తూ కృష్ణారావుగారిలా అన్నారట: "ఒక్కసారిలా చూడండి!''

అంతా ఆయన నేదో చెప్పబోతున్నారని ఆయన వైపు చూశారు.

ఆయన తన నెత్తిమీద ఉన్న పెద్ద తలపాగా తీసి బల్లమీద పెట్టి నున్నగా ఉన్న తన బట్టతల తడుముకుంటూ "నా కున్న ప్రత్యేకత ఇదొక్కటే—ఎందుకు బట్టతలకు క్రాపింగు దువ్వుతారు?'' అన్నారట.

దానితో వచ్చిన వారు తెల్లమొగం వేసి జారు కున్నారని వేరే చెప్పాలా!

## ఏలినవారి భోజన ప్రతాపం...!

ప్రకాశంగారిని మదరాసు రాష్ట్ర ప్రధాని (అప్పుడు ముఖ్యమంత్రిని 'ప్రధాని' అనే వారు) పదవి నుండి అవిశ్వాస తీర్మానం ద్వారా దింపివేశారు. తరవాత వచ్చిన మంత్రివర్గ సభ్యు లపై ఆయన కొన్ని అవినీతి ఆరోపణలు చేశారు. సాధారణంగా ఎక్కడ సభలలో ఉపన్యసించినా, ఆయన ఈ ఆరోపణలను వివరిస్తుండేవారు.

ఒకసారి ఆయన తన ప్రసంగంలో ఆ ప్రసక్తి తెచ్చి, "మనవాళ్ళు (మంత్రులు) బియ్యం తింటున్నారు, ఇనుము తింటున్నారు, సిమెంటు తింటున్నారు—సరే! ఆఖరుకు ఎరువు తింటుంటే!'' అనేసరికి సభ అంతా ఒక్కసారి నవ్వేశారు.

## రైలు చలోక్తి

గుంటూరు బండి పూర్వపు రోజుల్లో బహు నెమ్మదిగా నడిచేది. ఆ ఆధారంగా తీసుకుని అనేక చలోక్తులు పుట్టినవి. గుంటూరు బండి నడుస్తున్నదట. మంగళగిరి వద్ద పొలాల్లో ఒక ముసలమ్మ నెమ్మదిగా గుంటూరు వైపు నడుస్తూ పోతూ ఉండడం గార్డు చూసి, జాలిపడి బండి ఆపి, "ఎక్కు, అవ్వా పాపం. ముసలిదానివి ఏం నడుస్తావు? గుంటూరులో దిగబెడతాను రా'' అన్నాడట. ఆ ముసలమ్మ "నీ మంచితనం విన్న అట్లా అనిపించింది. నూరేళ్ళు బతుకు, నాయనా. బండీ ఎక్కడానికేం? ఇంకోసారి ఎప్పుడైనా ఎక్కుతాను. బండి ఎక్కమంటే ఎక్కలేదని మనసులో కష్టం ఉంచుకోకు, నాయనా. ఇవ్వాల కాస్త తొందర పని ఉంది, బాబూ'' అన్నదట.

బాబును పక్కలో వేసుకుని పడుకున్నాగా నిద్ర పోతున్న లలితకి పక్క గదిలో మాటలు మెలకువ తెప్పించాయి.

"అరె, అప్పుడే భోజనం టైమయిందా?"

"ఏమో, నాకేం తెలుసు? వంట, నా స్నానం అయాయి. కేరేజీ పుచ్చుకుని వచ్చేశాను. అసలు ఇంట్లో ఒక్కత్తినీ కూర్చుంటే పిచ్చెక్కేలా ఉండను కోవోయ్ . . . పాపం, నీకీ టైములో ఎవరయినా ఆడవాళ్ళు తోడుగా ఉంటే బాగుండేది కదూ? నేనేం చేయగలను?"

"ఇప్పుడు నాకేం తక్కువయిందని? చాల్లే — పూరుకోండి. మీరు భోంచేశారా?"

"ఉహూం, లేదు... ఇంటికి వెళ్ళాక తింటాలే."

"రేపట్నుంచీ మీరు తినకుండా తెస్తే నేను భోంచేయను—తెలిసిందా?"

"తెలిసింది, రాణిగారూ! ఇదిగో—నీ కిష్టమని వంకాయ వేపుడు చేశాను. భయపడవద్దు—డాల్డా వేసి వేయించాలే. ఇదుగో—ఈ రెండు కోడి గుడ్లూ తినెయ్యాలి. మిగిలిస్తే ఒప్పుకోను. కాస్త కొబ్బరి పొడి అన్నం కలిపియ్యనా ముందుగా. ఇవాళ నే నీకు తినిపిస్తానోయ్."

"ఉహూం. ఏం వద్దు గానీ కాస్సేపు మీ అమ్మా యిని ఇలా ఒళ్ళో ఉంచుకోండి. నేను భోంచేస్తాను."

"అలాగన్నావు బాగుంది. నా చిట్టితల్లి—నా బంగారు— ఏదీ ఇట్లా రామ్మా... ఆఁ—అదీ—అలా మెత్తగా పడుకుని చిరునవ్వులు చిందిస్తే చాలు మంచి అమ్మాయి లాగా—మీ అమ్మలాగా."

"నా లాగేం కాదు, మీ అమ్మాయి మీ పోలికే."

"పోన్లేవోయ్, తండ్రి పోలిక వచ్చిన అమ్మా యిలు అదృష్టవంతులవుతారట."

"ఏమండీ, ఎన్నాళ్ళు ఇలా అవస్థపడతారు? త్వరగా నన్ను డిస్‌చార్జ్ చేయమని చెప్పరూ?"

"ఒద్దొద్దు—నీలయినన్ని రోజులు నువ్విక్కడే ఉండాల్సిందే. ఇంటికొచ్చి, చాకిరీ అంతా చేసి ఆనా రోగ్యం కోరి తెచ్చుకోవాలనా? అయినా నీ పథ్యంతం ఉడికవులే. మూడు నెలల దాకా మంచం దిగటానికి వీల్లేదు. నీకు నాతో సేవలు చేయించుకోవటం ఇష్టంలేకపోతే చెప్పు. డబ్బు పడేస్తే ఏ ఆయానో దొరక్కపోదు."

"వూఁ—పడేస్తారు. మీకేం, చెట్లకి కాయుల్లా కాస్తున్నాయిగా రూపాయలు మన పెరట్లో."

"అవునోయ్, అలాగే అనుకో. నీ కన్నా నా చిట్టి తల్లి కన్నా నాకేదీ ఎక్కువ కాదు—తెలుసా?"

అసంకల్పితంగా లలిత కళ్ళలో నీళ్ళు తిరుగు తున్నాయి. ఒక్కసారి అంతగా అభిమానించే భర్తని పొందిన ఆ అదృష్టవంతురాలి ముఖం చూస్తే బావుండునని అనిపించింది ఆమెకు.

తన కోసం వచ్చేవాళ్ళెవరూ లేరు. రోజూ ఒక్క పది నిముషాలు తీరిక దొరకటం కూడా కష్టమే తన భర్తకి. ఆయ నకు ఎన్ని వ్యవహారాలో, కార్య కలాపాలో! అవన్నీ వదులుకుని హాస్పిటల్లో పడి ఉన్న తననేం చూస్తారు?

కొడుకు పుట్టాక అయినా ఆయన మారతాడను కుంది లలిత. కానీ అలాంటి సూచన లేవీ కనిపిం చటం లేదు ఆమెకు.

అంతా కర్మ... నే కోరుకున్న మొగుడే కదా. అనుభవించక తప్పేదేముంది? ఆరున్నర అడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గ లావు. చక్కని శరీర చాయ గల మంచి పర్సనాలిటీ, మగతనాన్ని ప్రతిబింబించే పెద్ద మీసాలు, విశాలమయిన ఛాతీ—ఆ ఠీవీ, ఆ గర్వం, ఆ నడకలో జోరూ— అన్నీ... అన్నీ... తను కోరుకుని, కలలు గన్న లక్షణాలే గద ఆయ నలో ఉన్నవి. ఆయనలో ఉన్న లోటు ఒక్కటే. ప్రేమాభిమానాలని అర్థం చేసుకోగల మనసు. దాని విషయం ఆ రోజుల్లో తనెప్పుడూ ఆలోచించ లేదు. అతి శ్రద్ధగా చదివి జీర్ణం చేసుకున్న కొన్ని వందల తెలుగు నవలల్లో హీరోలాగా ఉండా లనుకుంది తన భర్త. కాంతారావు ఆమె కోరుకున్న విధంగానే ఉన్నాడు. ఎటొచ్చీ అతని ప్రవర్తనే ఈ విధంగా ఉంటుందని వూహించలేకపోయింది ఆమె. ఒక్క సారి అమ్మని వచ్చి వెళ్ళమని ఉత్తరం రాయగల స్వాతంత్ర్యం కూడా ఆమెకు లేదిప్పుడు.

పక్క గదిలోంచి వద్దనుకున్నా వినవస్తున్న రాజేశ్వరరావు స్వరమూ, క్రితం రోజు కొన్ని క్షణాల



